సాక్షి కామారెడ్డి

ఆదివారం । 2 । జూన్ । 2024



హనుమాన్ జన్మోత్సవం

హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా శనివారం జిల్లాలోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- 8లో ▸



దర్జాగా మొరం దందా

ఎల్లారెడ్డి పట్టణంలో మొరం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అర్ధరాత్రి పూట దర్జాగా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
42.1 /27.6

వాతావరణం

ఉదయం ఎండ తీవ్రత కాస్త తగ్గుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

డీఎంహెచ్‌వో లైంగిక వేధింపులపై ఐసీసీ విచారణ

కామారెడ్డి టౌన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) లక్ష్మణ్‌సింగ్ మహిళా వైద్యాధికారుల వేధింపుల వ్యవహారంలో డిస్ట్రిక్ ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీ(ఐసీసీ) ఆధ్వర్యంలో శనివారం విచారణ నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా ఉన్న జిల్లా అటవీశాఖ అధికారి నిఖిత, కమిటీ సభ్యులు జిల్లా కేంద్రంలోని డీఎఫ్‌వో కార్యాలయంలో సుమారు ఏడు గంటల పాటు జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యులను, మహిళా వైద్యులతో మాట్లాడారు. ఈ విచారణలో డీఎంహెచ్‌వో వేధింపులను వైద్యులు వివరించారు. కుటుంబ పరంగా, విధుల్లో, వైద్య సేవల పరంగా, డీఎంహెచ్‌వో వేధింపులపై వారు వెల్లడించిన వివరాలను కమిటీ సభ్యులు నమోదు చేసుకున్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. అంతేకాకుండా కమిటీ సభ్యులు జిల్లా సంక్షేమ శాఖ అధికారి బావయ్య, ఐసీడీఎస్ అధికారిణి స్వర్ణలతలు బాధిత వైద్యులతో పాటు, డీఎంహెచ్‌వోను వేర్వేరుగా విచారణ జరిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే డీఎంహెచ్‌వో సస్పెన్షన్‌కు గురయ్యారు.

జిల్లా వ్యాప్తంగా 31 గుట్కా కేసులు



కామారెడ్డి క్రైం: జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, ఆయా గ్రామాల్లో ఉన్న కిరాణా దుకాణాలు, పాన్ షాప్‌లలో శనివారం చేపట్టిన దాడుల్లో మొత్తం 31 గుట్కా కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ సింధు శర్మ తెలిపారు. నిషేధిత గుట్కా, పాన్ మసాలా, పొగాకు వస్తువుల విక్రయాలను కట్టడి చేసేందుకు దాడులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఆస్పత్రిలో డీఎస్

ఖలీల్‌వాడి: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎంపీ అర్వింద్ శనివారం రాత్రి ట్వీట్ చేశారు. డీఎస్‌కు యురినల్ ట్రాన్ ఇన్ఫెక్షన్, సోడియం లాస్ ఉన్నట్లు వైద్యులు తెలిపారని అర్వింద్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

నిజామాబాద్ జీజీహెచ్‌లో న్యూరాలజీ సేవలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో న్యూరాలజీ సేవలు అందుబాటులో అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ తెలిపారు. జీజీహెచ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. రెండు నెలల క్రితం న్యూరో సర్జరీ సేవలు ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్, వరంగల్‌లో మాత్రమే న్యూరో శస్త్ర చికిత్స చేసేవారని, నిజామాబాద్ జీజీహెచ్‌లో సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇప్పటి వరకు 20మందికి న్యూరో సర్జరీలు చేశామన్నారు. రోగులకు సేవలందిస్తున్న డాక్టర్ వెంకటరమణారెడ్డి, వైద్యుల బృందానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

జయహో తెలంగాణ!



విద్యుత్ దీపాల వెలుగులో కలెక్టరేట్

- రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తి
- స్వయం పాలనలో ముమ్మందుకు..
- నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు

సాక్షి, కామారెడ్డి: తెలంగాణ రాష్ట్రం కోసం ఎన్నో త్యాగాలు, ఎన్నో పోరాటాలు జరిగాయి. దశాబ్దాల కల అయిన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై అప్పుడే పదేళ్లవుతోంది. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఉనికిలోకి వచ్చింది. నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు జరుపుకునేందుకు యావత్ జిల్లా ప్రజలు సన్నద్ధమయ్యారు. ప్రభుత్వ పరంగా జిల్లా కేంద్రంలో అమర వీరుల స్థూపం వద్ద కలెక్టర్ జితేష్ వి పాటిల్ అమరులకు పుష్పాంజలి ఘటించిన అనంతరం కలెక్టరేట్‌లో జాతీయపతాకాని ఆవిష్కరించనున్నారు. అనంతరం నిర్వహించే సమావేశంలో జిల్లా ప్రగతి నివేదికను కలెక్టర్ వినిపించనున్నారు.

కాగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పాలనలో ఎన్నో సంస్కరణలు జరిగాయి. ముఖ్యంగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల పునర్విభజన జరిగింది. దానికితోడు గ్రామ పంచాయతీల విభజన జరిగింది. దీంతో పాలన ప్రజలకు మరింత చేరువైందనే చెప్పాలి. కామారెడ్డి జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ సముదాయం, అలాగే పోలీసు కార్యాలయ భవనాలు ఆధునిక హంగులతో నిర్మించారు. కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించాల్సి ఉంది.



జిల్లా ఏర్పాటు చారిత్రక ఘట్టం

అప్పట్లో 36 మండలాలతో ఉన్న నిజామాబాద్ జిల్లాను రెండుగా విభజించారు. అలాగే కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త మండలాలు ఏర్పాటయ్యాయి. మూడు జిల్లాల కూడలిగా ఉన్న కామారెడ్డిని జిల్లా కేంద్రంగా చేయడంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి సాధించగలిగింది. కామారెడ్డి జిల్లా ఏర్పాటు చేసినపుడే ఎల్లారెడ్డి, బాన్సువాడ రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేశారు. అలాగే రామారెడ్డి, రాజంపేట, బీబీపేట, పెద్దకొడప్‌గల్, నస్రుల్లాబాద్, డోంగ్లీ, మహ్మద్‌నగర్, పాల్వంచ మండలాలు కూడా ఏర్పాటు చేసి పరిపాలన ప్రజలకు చేరువ చేసే ప్రయత్నం జరిగింది. మూడు రెవెన్యూ డివిజన్లు, 25 మండలాలతో ఏర్పాటైన కామారెడ్డి జిల్లాలో పాలన ప్రజలకు మరింత చేరువైందనే చెప్పాలి. గతంలో జిల్లా అధికారులు మండలాలకు ఏడాదికోసారి కూడా వేళ్లే పరిస్థితి ఉండేది కాదు. కాని కొత్త జిల్లాల ఏర్పాటైన తర్వాత జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న జుక్కల్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, పిట్లం, బిచ్కుంద మండలాలకు సైతం అధికారులు పరుగులు తీస్తున్నారు.

కొత్త పంచాయతీలతో పల్లెల్లో నవశకం

జిల్లా ఏర్పాటైన సమయంలో 323 గ్రామ పంచాయతీలు ఉండేవి. అయితే కొత్తగా 214 పంచాయతీలు ఏర్పాటయ్యాయి. 11 పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో పంచాయతీ సంఖ్య 526కు చేరింది. ప్రధానంగా దశాబ్దాలుగా తండాలను పంచాయతీలు చేయాలని గిరిజనుల కల నెరవేరింది. కొత్త పంచాయతీల ఏర్పాటుతో గ్రామాల్లో పాలన మరింత చేరువైందనే చెప్పాలి. పంచాయతీలకు కార్యదర్శుల నియామకం కూడా చేపట్టడంతో పాలనకు ఇబ్బందులు తొలగాయి. కొత్త పంచాయతీలు ఏర్పాటు మూలంగా పల్లెల్లో నవశకం మొదలైందనే చెప్పాలి. ఇంతకాలం పొరుగు గ్రామలపై ఆధారపడ్డ ఆ గ్రామాల ప్రజలు ఇప్పుడు తమను తాము పాలించుకుంటున్నారు. ఏది ఏమైనా రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రగతి పరుగులు తీయడం, పాలన ప్రజలకు చేరువ కావడంతో ఆనందం వ్యక్తమవుతోంది.

ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలు..

కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తర్వాత జిల్లాలో ఒక్క కామారెడ్డి మున్సిపాలిటీ మాత్రమే ఉండేది. నియోజకవర్గ కేంద్రమైన బాన్సువాడ పట్టణాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. అనంతరం ఎల్లారెడ్డిని కూడా మున్సిపాలిటీగా మార్చారు. కామారెడ్డి మున్సిపాలిటీలో ఏడు గ్రామాలను విలీనం చేసి మున్సిపాలిటీ పరిధిని విస్తరించారు. చిన్న పట్టణాలుగా ఉన్న బాన్సువాడ, ఎల్లారెడ్డిలను ఏకంగా మున్సిపాలిటీలు చేయడం ద్వారా అభివృద్ధికి బాటలు పడ్డాయి. మున్సిపల్‌శాఖ ద్వారా రూ. కోట్లల్లో నిధులు వస్తుండడంతో ప్రగతి పరుగులు తీస్తోంది.

తాగునీటికి సాగర్ జలాలు

- నేటి నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల

నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు బోధన్, బాన్సువాడ పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు ఆదివారం నీటిని విడుదల చేయనున్నారు. బోధన్, నిజామాబాద్ పట్టణ ప్రాంతాలకు అలీసాగర్ రిజర్వాయర్ ద్వారా నీటిని సరఫరా చేసున్నారు. అలీసార్ రిజర్వాయర్ 300 ఎంసీఎఫ్టీలకు గాను ప్రస్తుతం 100 ఎంసీఎఫ్టీల నీరు మాత్రం నిల్వ ఉంది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసి, అలీసాగర్ రిజర్వాయర్‌కు నీరందించనున్నారు.

ప్రధాన కాలువ తూములకు వెల్డింగ్

నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో తాగునీరు వృథా చేయకుండా ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటరీ తూములను వెల్డింగ్ చేస్తున్నారు. ప్రధాన కాలువ మొదటి డిస్ట్రిబ్యూటరీ నుంచి 49వ డిస్ట్రిబ్యూటరీ వరకు ఉన్న తూముల షటర్లను నీటి పారుదలశాఖ అధికారులు వెల్డింగ్ పనులు చేపట్టారు. ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయగా ఆయకట్టు కింద వరి నారుమళ్లు, పంటల సాగుకు ఉపయోగించకుండా తూములను సీజ్ చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో రైతులు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

4.8 టీఎంసీల నీరు నిల్వ

ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.8 టీఎంసీలకు గాను ప్రస్తుతం 4.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. యాసంగి పంటలకు ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు పలు దఫాల్లో 12 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఆయకట్టు పంటలు గట్టెక్కడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో 4.8 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం వానాకాలం పంటల సాగు, వరి నారుమళ్లు వేసుకునేందుకు ప్రాజెక్టు నీటి నిల్వలు ఆయకట్టు ప్రాంత రైతులకు భరోసాగా ఉన్నాయి. అయితే ప్రధాన కాలువ కింద బోరు బావులు ఉన్న వర్ని, కోటగిరి, రుద్రూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ మండలాల రైతులు నారుమళ్లు వేస్తున్నారు. పదిహేను రోజుల్లో వరి నాట్లకు సిద్ధం కానున్నారు.

అలీసాగర్ నింపడానికి..

నిజామాబాద్, బోధన్ పట్టణ ప్రాంత ప్రజల తాగునీటి అవసరాల మేరకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయనున్నాం. ప్రధాన కాలువ ద్వారా విడుదల చేస్తున్న నీటిని అలీసాగర్ రిజర్వాయర్ నింపుతాం. ప్రధాన కాలువలో ప్రవహించే తాగునీటిని ఆయకట్టు ప్రాంత రైతులు దుర్వినియోగం చేయవద్దు. రోజుకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తాం.

– శ్రీనివాస్, నీటిపారుదల శాఖ సీఈ



336 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి

- అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

కామారెడ్డి క్రైం: యాసంగికి సంబంధించి ఇప్పటి వరకు 336 ధాన్యం సేకరణ కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి గాను జిల్లాలో మార్చి 26న ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 327, ఐకేపీ ద్వారా 23 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మరో 14 కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ సాగుతోందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 54,353 మంది రైతుల నుంచి 3,12,492 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. 98 శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేశామన్నారు. రూ.645 కోట్లను రైతుల ఖాతాలో జమ చేశామని చంద్ర మోహన్ తెలిపారు.

ఫాంపాండ్‌లతో రైతులకు అదనపు ఆదాయం



ఉగ్రవాయిలోని చెరువులో ఫాంపాండ్ గుంతలను గడ్డపారతో తవ్వుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి రూరల్: వ్యవసాయ క్షేత్రంలో ఫాంపాండ్ గుంతలు నిర్మించుకోవడంతో అటు వ్యవసాయంతో పాటు ఇటు చేపల పెంపకం చేపట్టి అదనపు ఆదాయాన్ని సంపాదించుకోవచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ రైతులకు సూచించారు. శనివారం కామారెడ్డి మండలం ఉగ్రవాయిలో ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న ఫాంపాండ్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తాను కూడా గడ్డపార పట్టి మట్టిని తవ్వుతూ అక్కడ ఉన్న కూలీలకు ఉత్సాహం కలిగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొర్రమీను చేపలకు మార్కెట్లో ఎంతో డిమాండ్ ఉందన్నారు. ఏడాదిలో మూడు సార్లు ఫాంపాండ్‌లో చేప పిల్లల పెంపకం చేపట్టవచ్చని, తద్వారా రైతులకు ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ నీటిని వ్యవసాయ క్షేత్రానికి తరలించడం ద్వారా రసాయనిక ఎరువులు వేసే అవసరం కూడా ఉండదన్నారు. ఆసక్తి గల సన్న, చిన్నకారు రైతులకు సబ్సిడీతో పాటు సాంకేతిక సలహాలు అందిస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో మలహరి, ఏపీవో నరేందర్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌లో ఉద్యోగాల పేరిట టోకరా

- 60 మంది నుంచి రూ. 17 లక్షల వరకు వసూలు
- ఆఫై ఉడాయించిన సంస్థ
- నిందితులు ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు



నిందితులు వీరే..

కామారెడ్డి క్రైం: ఇజ్రాయిల్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని నమ్మించి రూ. లక్షల్లో డబ్బులు వసూలు చేయడమే కాకుండా కార్యాలయానికి తాళం వేసి ఉడాయించిన ముగ్గురిని పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి కథనం ప్రకారం.. ఆర్మూర్ పట్టణానికి చెందిన మీసాల కిరణ్, గుజ్జుల విజయ్, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అలీలు కలిసి కామారెడ్డిలోని ఎన్జీవోస్ కాలనీలో ఉన్న దేవి హస్పిటల్ ఎదురుగా ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని డెక్కన్ అబ్రాడ్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ పేరిట ఓ సంస్థను ప్రారంభించారు. ఇజ్రాయిల్‌లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, తక్కువ ఖర్చుతో అక్కడికి పంపిస్తామని చాలా మందిని నమ్మించారు. కామారెడ్డితో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన దాదాపు 60 మంది నుంచి రూ. 17 లక్షల వరకు వసూలు చేసిన తర్వాత బోర్డు తిప్పేశారు. వీసాల కోసం తాము డబ్బులు చెల్లించామని.. కానీ నిర్వాహకులు కార్యాలయానికి తాళంవేసి పరారయ్యారని గత నెల 15న కొందరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. సదరు ముగ్గురు వ్యక్తులు శనివారం రెండు కార్లలో కార్యాలయం వద్దకు రాగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ల్యాప్‌టాప్, కంప్యూటర్, ఫోన్లు, ఇతర రికార్డులను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిందితుల్లో మీసాల కిరణ్ అనే వ్యక్తి ఆధార్ కార్డులో తన పేరును క్రాంతి కుమార్‌గా మార్చుకోవడమే కాకుండా అడ్రస్ కూడా మార్చివేశాడని పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా గుర్తు తెలియని వ్యక్తి పేరు మీద ఫెడరల్ బ్యాంకులో ఖాతా తెరిచి బాధితుల నుంచి వచ్చిన డబ్బును అందులో వేసినట్లు గుర్తించామని ఎస్‌హెచ్‌వో వెల్లడించారు. ఇంకా ఏవరైనా బాధితులుంటే పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

సేద్యానికి చేయూత!

- రైతుబంధు ద్వారా రూ. 2,776 కోట్ల సాయం
- 1.09 లక్షల బోరుబావులకు ఉచిత విద్యుత్తు
- చనిపోయిన రైతు కుటుంబాలకు బీమా ధీమా
- పంట ఉత్పత్తుల కొనుగోళ్లతో ఊరట

సాక్షి, కామారెడ్డి: త్యాగాల పునాదుల మీద ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి విశేష కృషి జరిగింది. అనేక కార్యక్రమాలు అమలయ్యాయి. చిన్న నీటి వనరులైన చెరువులు, కుంటలను మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించడం, భూగర్భజలాలపై ఆధారపడిన రైతాంగానికి బోర్లు, బావులకు ఉచితంగా 24 గంటల పాటు విద్యుత్తు సరఫరా, రైతులకు పెట్టుబడి సాయంగా ప్రతి సీజన్‌కు ఎకరానికి రూ. 5వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయడం, ఏదేని కారణంగా రైతు చనిపోతే రైతు కుటుంబానికి రైతు బీమా ద్వారా రూ.5 లక్షలు సాం అందించడం, రైతు పండించిన పంటలను కొనగోళ్లు చేయడం.. ఇలా ఎన్నో కార్యక్రమాల ద్వారా రైతులకు చేయూత లభించింది. భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టిన ప్రభుత్వం ధరణి పోర్టల్‌లో మొత్తం రికార్డులను నమోదు చేసింది. అయితే రికార్డుల ప్రక్షాళనలో కొందరు రెవెన్యూ ఉద్యోగులు, అధికారుల అవినీతి, అక్రమాలతో చాలా మంది రైతులు ఇబ్బందుల పాలయ్యారు. రెవెన్యూలో కింది స్థాయిలో పనిచేసే వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థలు రద్దవడానికి ఇదే ప్రధాన కారణం. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరిగింది. అయితే కొనుగోళ్ల సందర్భంగా తరుగు పేరుతో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేసిన సంఘటనలు ఉన్నాయి.

పెట్టుబడి కోసం రైతుబంధు

కేసీఆర్ నాయకత్వంలోని అప్పటి ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. పంటల సాగుకు ఎకరాకు ఒక్కో సీజన్‌లో రూ.5 వేల చొప్పున నేరుగా రైతు ఖాతాల్లోకి జమ చేసింది. ఇది రైతులకు ఎంతో కొంత మేలు చేసిందనే చెప్పాలి. అయితే బడాబాబులు, పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్న భూములకూ రైతుబంధు సాయం అందడంపైనే కొంత వ్యతిరేకత ఉంది. జిల్లాలో 3.04 లక్షల మంది రైతులకు రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం అందించారు. ఇప్పటి వరకు 12 విడతల్లో సాయం అందింది. రూ. 2,776.81 కోట్ల సాయం జిల్లా రైతులకు అందింది.



రైతు చనిపోతే బీమాతో కుటుంబానికి ఆసరా..

తెలంగాణ ఏర్పాటైన తర్వాత ప్రవేశపెట్టిన రైతుబీమా పథకం చనిపోయిన రైతు కుటుంబాలకు ఆసరాగా నిలిచింది. 60 ఏళ్లలోపు రైతులందరికీ ప్రభుత్వమే రైతుబీమా ప్రీమియం చెల్లిస్తుంది. అందులో ఏ రైతు, ఏ కారణం చేత చనిపోయినా సరే ఆ కుటుంబాలకు రూ. 5లక్షల సాయం అందిస్తుంది. ఈ పథకం ప్రారంభమై ఏడేళ్లవుతోంది. జిల్లాలో 7,039 మంది రైతులు చనిపోగా, వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున రూ. 328.45 కోట్లు బీమా సొమ్మును అందించారు. దీంతో ఆ కుటుంబాలకు ఎంతో కొంత ఆసరా అయ్యిందనే చెప్పాలి.

10 వసంతాల తెలంగాణ

24 గంటల పాటు ఉచిత విద్యుత్తు

సాగునీటి ప్రాజెక్టులు లేని ప్రాంతాల్లో రైతాంగం భూగర్భజలాలపైనే ఆధారపడి సేద్యం చేస్తుంటారు. దివంగత సీఎం వైఎస్సార్ ఉచిత విద్యుత్తు పథకాన్ని తీసుకువచ్చి అమలు చేశా రు. అప్పుడు మొదలైన ఉచిత విద్యుత్తు పథకా న్ని తెలంగాణ ఏర్పాటు తర్వాత సేద్యానికి 24 గంటల పాటు ఉచితంగా అందించడం ద్వారా మరింత చేయూతనందించారు. జిల్లాలో 1,09, 436 బోర్లు, బావులు ఉన్నాయి. వాటన్నింటికీ ఉచితంగా విద్యుత్తు అందిస్తున్నారు.

పంటల కొనుగోళ్లు..

రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు అనేక సమస్యలు ఎదురయ్యేవి. దళారులు నిర్ణయించిందే ధరగా చెల్లుబాటయ్యేది. ఎంఎస్‌పీ ప్రకారం కొనుగోళ్లకు ఎన్నో ఆటంకాలు ఎదురయ్యేవి. రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్దకే వెళ్లి కొనుగోలు చేసేలా కేంద్రాలను ఊరూరా తెరిచింది. కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తర్వాత 2017–18 నుంచి మొదలుకుని ఇప్పటి వరకు జిల్లాలో 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. దీనికి రూ. 9,198 కోట్లు రైతులకు చెల్లించింది. మక్కలు, శనగ, సోయా, పత్తి తదితర పంటల ఉత్పత్తులను వివిధ సంస్థల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయి.

మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ

గొలుసుకట్టు చెరువులన్నింటినీ మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించింది. ఈ కార్యక్రమాన్ని అప్పటి సీఎం కేసీఆర్ కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లోని చెరువులోనే శ్రీకారం చుట్టారు. జిల్లాలో మూడు విడతల్లో 965 చెరువులను పునరుద్ధరించారు. వీటికోసం రూ. 281.57 కోట్లు ఖర్చు చేశారు. చెరువు కట్టలను బలోపేతం చేయడం, అలుగులు, తూముల మరమ్మతు వంటి పనులు చేపట్టారు. చెరువుల మరమ్మతులతో చాలాచోట్ల ప్రయోజనం కలిగింది. ముఖ్యంగా భూగర్భ జలమట్టం పెరగడానికి దోహదపడింది. అలాగే నియోజకవర్గానికి ఒకటి రెండు చొప్పున మినీ ట్యాంక్‌బండ్ పనులు కూడా చేపట్టారు.

భూరికార్డుల ప్రక్షాళన.. ధరణి

రాష్ట్రంలో భూరికార్డుల ప్రక్షాళన చేపట్టి రికార్డులన్నీ ధరణి పోర్టల్‌లో నమోదు చేశారు. తహసీల్దార్ కార్యాలయాల్లోనే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకున్నారు. అయితే భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా అనేక అక్రమాలు, అవకతవకలు జరిగి సామాన్యులు చాలా మంది ఇబ్బందుల పాలయ్యారు. ఇప్పటికీ చాలాచోట్ల భూ రికార్డుల సమస్యలపై రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఎక్కువ ఫిర్యాదులు వీటిపైనే వస్తున్నాయి. ధరణి దిద్దుబాటు చర్యలు చేపట్టినా ఇంకా పూర్తి స్థాయిలో అమలు జరగడం లేదు.

క్లుప్తంగా

కొలతల ప్రకారం దుస్తులు కుట్టాలి



బాన్సువాడ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా అందించే యూనిఫారంలను కొలతల ప్రకారం నాణ్యమైన దారంతో కుట్టాలని ఎంపీడీవో బషీరుద్దీన్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని 6 సెంటర్లకు ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసిన వస్త్రాన్ని సరఫరా చేశారు. ఆయన వెంట ఎంపీవో సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

ఉద్యోగ విధుల్లో సేవలే శాశ్వతం

కామారెడ్డి టౌన్ : ప్రభుత్వ శాఖల్లో చేసే విధుల సేవలే శాశ్వతమని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ అధికారి రమేశ్ బాబు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన డివిజనల్ ఇంజినీర్ టెక్నికల్ అధికారి వెంకటరంగయ్య పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. నిజామాబాద్ ఎస్ఈ రవీందర్, డీఈ శాలియా నాయక్, జిల్లాలోని ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

పనులు శరవేగంగా పూర్తి చేయాలి



బాన్సువాడ రూరల్: మండలంలోని చిన్న రాంపూర్, పులికుచ్చతండా, సోమేశ్వర్, బోర్లం క్యాంపు తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ పరిశీలించారు. ఎంపీవో సత్యనారాయణరెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కాలువపై బుంగ పూడ్చివేత



బాన్సువాడ రూరల్ : మండలంలోని రాంపూర్ తండా శివారులో 19వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీ సమీపంలో నిజాంసాగర్ ప్రధాన కాలువకు బుంగ పడింది. దీంతో నిజాంసాగర్ ప్రధాన కాలువద్వారా నీటిని వదిలినప్పుడు సాగునీరు వృథాగా పోతోంది. దీంతో స్పందించిన అధికారులు శనివారం బుంగ ఏర్పడిన చోట సిమెంట్ కాంక్రీట్‌తో పూడ్చివేయించారు. పనులను ఈఈ రాజశేఖర్, డీఈ జగదీష్‌లు పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. వారివెంట ఏఈ గజానన్, వర్క్ ఇన్స్‌పెక్టర్ సంగం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు



బాన్సువాడ రూరల్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కోసం అధికారులు, సిబ్బంది ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల, కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కొయ్యగుట్టలోని తెలంగాణ అమరవీరుల స్థూపం గ్రానేట్ రాళ్ళు ఊడిపోవడంతో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఆధ్వర్యంలో మరమ్మత్తులు కొనసాగుతున్నాయి.

దర్జాగా మొరం దందా..

- రాత్రివేళల్లో గుట్టుగా రవాణా
- సిబ్బంది కొరతతో అధికారుల నిస్సహాయత

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలో మొరం అక్రమ రవాణా దర్జాగా సాగుతోంది. అర్ధరాత్రి వేళ జోరుగా ట్రాక్టర్లలో రవాణా కారణంగా విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పగటిపూట తరలిస్తే అధికారులు, ప్రజలు అభ్యంతరాలు చెబుతున్నారన్నా ఉద్దేశంతో అక్రమ రవాణాకు రాత్రివేళ సరైన సమయంగా భావించి మొరంను తరలిస్తున్నారు. అర్ధరాత్రి మొరం తరలింపునకు ఎలాంటి అనుమతులు అక్కర్లేదంటూ దర్జాగా ట్రాక్టర్లలో తోలుతున్నారు. పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న అక్రమ మొరం రవాణాను నిరోధించాల్సిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సిబ్బంది కొరత కారణం చెబుతూ పట్టించుకోకపోవడమే అక్రమ తరలింపునకు కారణమని తెలుస్తోంది. స్థానిక నాయకుల అండదండలతో ఈ అక్రమ రవాణ వ్యవహారం నడుస్తోంది.

చోటా లీడర్లదే హవా..

కొందరు చోటా లీడర్లు తామే జేసీబీ ప్రొక్లెయిన్లు తెచ్చుకుని ఈ అక్రమ మొరం రవాణా వ్యాపారాన్ని పెద్దఎత్తున చేస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారుతూ తమ అక్రమ వ్యాపారాన్ని దర్జాగా నడిపిస్తున్నారు. భవన నిర్మాణపు పనులకు మొరం అవసరమైన వారు చట్టబద్ధంగా తీసుకోవాలంటే వాల్టా చట్టం ప్రకారం చలానా కట్టి రెవెన్యూ అధికారులకు చూపించి వారు చూపెట్టిన చోట నుంచి మొరం తీసుకోవాలి. ఈ తతంగం కోసం రెండు మూడు రోజులు ఆఫీసుల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. అదే ఈ అక్రమ రవాణ దారులను సంప్రదించగానే ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే తెల్లవారే సరికి అవసరమైన మొరం వారి ఇంటి వద్దకు వచ్చిపడుతోంది. ఈ వెసులుబాటుకు అలవాటు పడ్డ ఇళ్ల యజమానులు తమకు కావాల్సిన మొరం కోసం కార్యాలయాలకు వెళ్లకుండా అక్రమ రవాణాదారులనే ఆశ్రయిస్తున్నారు.



ఎల్లారెడ్డిలో రాత్రివేళ తరలిస్తున్న మొరం

సిబ్బంది కొరత..

ఎల్లారెడ్డి పరిసర ప్రాంతాలలో విచ్చలవిడిగా సాగుతున్న మొరం అక్రమ రవాణ విషయమై స్థానిక తహసీల్దార్ మహేందర్ కుమార్‌ను వివరణ కోరగా రాష్ట్రంలో వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేయడంతో సిబ్బంది కొరత ఏర్పడిందని అందువల్లే తాము అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయలేకపోతున్నామన్నారు. అక్రమ మొరం రవాణాను ఆపేందుకు పోలీసుల సహాయం తీసుకోవాలని తమకు పైఅధికారులు ఆదేశించినా పోలీసులు తమ సహకారం అందించడం లేదన్నారు. ఇదే విషయమై ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌ను వివరణ కోరగా అక్రమ మొరం రవాణా కట్టడి విషయంలో తమకు తమ శాఖాపరంగా ఎలాంటి ఆదేశాలు లేవన్నారు. అయినప్పటికీ అక్రమ రవాణ జరుగుతుందని తెలిస్తే తాము దాడులు చేసి కేసులు పెడుతున్నామన్నారు. అధికార యంత్రాంగాల మధ్య కొరవడిన సమన్వయ లోపం అక్రమ రవాణాదారులకు వరంగా మారింది.

తహసీల్ ఎదుట రైతుల ఆందోళన

- పొలాలకు విద్యుత్ కనెక్షన్ పనులు నిలిపివేయడంతో ధర్నా
- కుటుంబ సభ్యులతో కలిసి పురుగు మందు డబ్బాలతో నిరసన



కమ్మర్‌పల్లి తహసీల్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

కమ్మర్‌పల్లి: తమ వ్యవసాయ భూముల్లో విద్యుత్ కనెక్షన్ పనులు ఎందుకు నిలుపుదల చేయించారని ప్రశ్నిస్తూ కమ్మర్‌పల్లి తహసీల్ కార్యాలయం ఎదుట శనివారం సాయంత్రం చౌట్‌పల్లికి చెందిన రైతులు బైఠాయించారు. మాజీ సర్పంచ్ మారు శంకర్, బద్దం రాజేశ్వర్, కొమ్ముల వెంకన్న, కొట్టాల రాజేశ్వర్‌లు తమ కుటుంబ సభ్యులతో కలిసి పురుగు మందుల డబ్బాతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. 9 నెలల క్రితం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ట్రాన్స్‌కోకు దరఖాస్తు చేసుకొని డీడీలు చెల్లించామన్నారు. ట్రాన్స్‌కో అధికారులు ఆ భూముల్లో స్తంభాలు వేయించారు. తీగలు బిగించే పని మిగిలి ఉండగా, తహసీల్దార్ ఆంజనేయులు ఏఈ కృష్ణకు ఫోన్ చేసి విద్యుత్ లైన్ పనులు నిలుపుదల చేయాలని ఆదేశించారన్నారు. ఆ భూములపై వివాదం ఉందని పనులు ఆపేయాలని సూచించారన్నారు. కాంగ్రెస్ నేత సునీల్ రెడ్డి ప్రోద్బలంతోనే తమ భూముల్లో పనులు నిలిపివేశారని రైతులు ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసు లు తహసీల్ కార్యాలయానికి చేరుకొని రైతుల వద్ద నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. ఎస్సై రాజశేఖర్ సమక్షంలో రైతులు తహసీల్దార్‌తో చర్చించారు. మంత్రి కొండా సురేఖ నుంచి ఆ భూమి స్వభావం ఏమిటో తేల్చాలని లేఖ తమకు అందిందని తహసీల్దార్ రైతులకు వివరించారు. ఇలా ఎన్నిసార్లు ల్యాండ్ సర్వే చేస్తా రని రైతులు ప్రశ్నించారు. కావాలనే తమను సతాయిస్తున్నారని రైతులు మండిపడ్డారు. చివరకు తహసీల్దార్, ఉన్నతాధికారులను ఫోన్‌లో మాట్లాడారు. ఈ నెల 12న భూమి సర్వే చేసి రిపోర్టు సమర్పిస్తామని తహసీల్దార్ అంజనేయులు తెలియజేశారు. దీంతో రైతులు వెనుదిరిగారు.

క్రైం కార్నర్

వరద కాలువలో పడి ఒకరి మృతి

మోర్తాడ్(బాల్కొండ): పాలెం శివారులోని వరద కాలువలో పడి మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన కూరగాయల సుధాకర్(34) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆయన మృతదేహం శనివారం లభ్యమైంది. సుధాకర్ మానసిక స్థితి ఇటీవల సరిగా లేదు. మద్యం కూడా సేవిస్తుండేవాడని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వరద కాలువలో పడి ఉంటాడని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మరొకరు..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): దుర్కి గ్రామంలో బర్ల సాయిబాబా(35) అనే వ్యక్తి శనివారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పాత బాన్సువాడకు చెందిన సాయిబాబా పట్టణంలో గల రామకృష్ణ ఏజెన్సీస్‌లో కూలిగా పని చేస్తాడు. అందులో భాగంగా దుర్కి గ్రామంలో సామాను దింపడానికి వచ్చాడు. సామాను దింపుతున్న సమయంలో 11కేవీ లైన్ తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ ఆయన బాన్సువాడ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

డిచ్‌పల్లి: నడిపల్లి శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,250 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి బాలిక మృతి




కల్పిత(ఫైల్)

భీమ్‌గల్: ట్రాక్టర్ కింద పడి బాలిక మృతి చెందిన ఘటన పురాణిపేట్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పురాణిపేట్ గ్రామానికి చెందిన రౌతు సంతోష్ కుమార్తె కల్పిత(9) ఇంటి దగ్గర ఉన్న ట్రాక్టర్‌పైన ఆడుకుంటుండగా.. అనుకోకుండా ట్రాక్టర్ స్టార్ట్ అయ్యి, ముందుకు కదిలింది. దీంతో బాలిక భయపడి ట్రాక్టర్ మీద నుంచి కిందకి దూకగా.. ఆమెపై నుండే ట్రాక్టర్ వెళ్లింది. దీంతో బాలిక అక్కడిక్కడే మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృత దేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- యువకుడి మృతి.. మరొకరికి గాయాలు



రాకేశ్ రావు(ఫైల్)

కామారెడ్డి క్రైం: ఓ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం రాకేశ్ రావు(26) అనే యువకుడి నిండు ప్రాణాన్ని బలిగొంది. వివరాలు.. కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన రాకేష్ రావు(26), ఆయన స్నేహితుడు చాకలి రాకేష్‌లు బైక్‌పై కామారెడ్డి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా రాత్రి 10 గంటల సమయంలో నిజాంసాగర్ చౌరస్తా వద్ద వెనక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా పోలీసులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాకేష్ రావు పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మృతుడి భార్య సుస్మిత ఫిర్యాదు మే రకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



సుభాష్ మృతదేహం

రుద్రూర్: కోటగిరి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బాటి సుభాష్(42)అనే వ్యక్తి శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. కోటగిరి నుంచి బస్వాపూర్‌కు ఎక్సె ల్ వాహనంపై సుభాష్ వెళ్తుండగా.. ఎక్లాస్‌పూర్ వద్ద వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కరెంట్ షాక్‌తో గేదె మృతి

రామారెడ్డి: కరెంట్ షాక్ తగిలి గేదె మృతి చెందిన ఘటన సదాశివనగర్ మండలంలోని కుప్రియాల్‌లో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఏలేటి రాజిరెడ్డికి చెందిన గేదె ఈ ఘటనలో చనిపోయింది. గేదె విలువ రూ.60 వేలు ఉంటుందని, నష్టపరిహారం ఇప్పించాలని రైతు కోరారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ



బాధితురాలు లక్ష్మి

ఆర్మూర్ టౌన్: పెర్కిట్‌లోని జాతీయ రహదారి-44పై శనివారం సాయంత్రం ఓ మహిళ మెడలో నుంచి 3 తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. వివరాలు.. మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన జిల్లా లక్ష్మి తన భర్తతో కలిసి బైకుపై మాక్లూర్ మండలం మదనపల్లిలోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి మోర్తాడ్ వస్తున్న సమయంలో పల్సర్ బైక్‌పై ముగ్గురు వచ్చి లక్ష్మి మెడలో నుంచి 3 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఆ సమయంలో బైక్ పైనుంచి పడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. బాధితురాలు ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కేశ్‌పల్లి యువకుడి అదృశ్యం

జక్రాన్‌పల్లి: కేశ్‌పల్లి గ్రామానికి చెందిన మున్నూరు జగదీష్(28) అనే యువకుడు ఈ నెల 31న అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వివరాలు..సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పిన జగదీష్ ఇంటికి తిరిగి రాలేదు. తల్లి బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరికైన ఆచూకీ తెలిస్తే జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు సెల్ నెంబర్ 8712659853 ద్వారా తెలపాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శర్బతీకెనాల్‌లో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులుగా మృతుడి ఆచూకీ తెలియడం లేదని, ఆచూకీ తెలిసిన వారు 87126 59870 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

నగరంలో కత్తిపోట్ల కలకం

ఖలీల్ వాడి: నగరంలోని ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ధర్మపురి హిల్స్‌లో శనివారం కత్తిపోట్ల కలకలం రేగింది. వివరాలు.. డెయిరీ ఫామ్ చెందిన మొహమ్మద్ అద్నాన్ తన నలుగురు స్నేహితులతో కలిసి ధర్మపురి హిల్స్‌కి వెళ్లాడు. అదే ప్రాంతానికి చెందిన అన్నదమ్ములు సమీర్, రేహాన్‌లు తమ స్నేహితులతో ఉన్నారు. అద్నాన్‌తో సమీర్, రేహాన్‌కు మాటా మాటా పెరిగి గొడవకు దారి తీసింది. సమీర్‌ను గతంలో కొట్టారని రేహాన్ కత్తితో మూకుమ్మడిగా మొహమ్మద్ అద్నాన్‌పై దాడి చేశాడు. దీనితో అద్నాన్ చెయ్యి తెగింది. తీవ్రంగా గాయపడటంతో అతడిని బోధన్ రోడ్డులోని సిటీ ఆస్పత్రికి తరలించారు. చేయి తెగడంతో వైద్యులు ఆపరేషన్ చేశారు. ఆస్పత్రికి సౌత్ సీఐ సురేష్, ఎస్సైలు వెళ్లి వివరాలు ఆరా తీశారు. కత్తితో దాడికి పాల్పడినా పోలీసులకు ఇరు వర్గాల వారు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.

భర్తకు అంత్యక్రియలు చేసిన భార్య



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయికి చెందిన బెస్త సుదర్శన్(50) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుదర్శన్‌కు కుమారులు లేకపోవడంతో భార్య పద్మ అంత్యక్రియలు నిర్వహించారు.

తెరవే ఆధ్వర్యంలో పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బైస దేవదాస్ తదితరులు

కామారెడ్డి అర్బన్ : సాహిత్యం సమాజం బాగుపడాలని కోరుకుంటుందని, కవులు నిస్వార్థంగా సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నారని సీనియర్ జర్నలిస్టు, నేటి నిజం సంపాదకులు బైస దేవదాస్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తకావిష్కరణ సభలో తెరవే జిల్లా అధ్యక్షుడు సిరిసిల్లా గఫూర్ శిక్షక్ రాసిన 'యుద్ధ గీతం', తెరవే కవుల ఎన్నీల ముచ్చట్లు ఉగాది కవితల సంకలనం 'కవన సమీరాలు' పుస్తకాలను బైస దేవదాస్, కొండి మల్లారెడ్డిలు ఆవిష్కరించారు. సభకు ప్రముఖ కవి, రచయిత యెనిశెట్టి గంగాప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా హాజరైన తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి మాట్లాడుతూ అక్షరాలు సమాజాన్ని వెలుగు బాటలోకి తీసుకుపోతాయన్నారు.

సభలో కాలమిస్టు జి.లచ్చయ్య, కవులు, రచయితలు సూరారం శంకర్, అల్లి మోహన్‌రాజ్, పబ్బ విజయశ్రీ, డా.సునీత, కాసర్ల రామచంద్రం తదితరులున్నారు.

అటుకులపై జిల్లాల పేర్లు





మద్నూర్(జుక్కల్) : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రానికి చెందిన పండరి తెలంగాణలోని 33 జిల్లాల పేర్లను అటుకులపై రాయడంతో పలువురు అభినందించారు. శనివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా ఏదైనా ప్రత్యేకంగా తయారు చేద్దామని తెలంగాణలోని అన్ని జిల్లాల పేర్లను అటుకులపై రాసినట్లు ఆయన చెప్పారు.

వృత్తి పునరుద్ధరణ దరఖాస్తులకు నోటిఫికేషన్

ఖలీల్‌వాడి: న్యాయవాదులుగా కొనసాగుతున్న వారు తమ వృత్తి పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి తెలిపారు. ప్రతి న్యాయవాది విధిగా సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ ఫాంను తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్రోల్ సర్టిఫికెట్, సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ లేదా బార్ కౌన్సిల్ జారీచేసిన న్యాయవాది గుర్తింపు కార్డు, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, టీఎస్‌సీవోపీ వెరిఫికేషన్ ఫండ్ పేరున రూ.500 డిమాండ్ డ్రాఫ్ట్ హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యేవిధంగా లేదా హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు నగదు చెల్లించవచ్చని తెలిపారు.

ఐదేళ్లుగా సంబంధిత కోర్టులలో న్యాయవాదిగా వృతిలో కొనసాగుతున్నట్లుగా వకాలత్ నామాలు, మెమో ఆఫ్ అప్పియరన్స్, కోర్టుల కాజ్ లిస్ట్, జడ్జిమెంట్స్, ఆర్డర్స్ జత చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తులలో సంబంధిత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లేదా ప్రధాన కార్యదర్శి సంతకం తీసుకోవాలని సూచించారు.

ముగ్గురు విద్యార్థుల డిబార్


తెయూ(డిచ్‌పల్లి): డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో శనివారం 627 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడి ట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, నిజామాబాద్ ఇందూరు ఉషోదయా మహిళా డిగ్రీ కాలేజ్, బోధన్‌లోని ఎస్వీ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రంలో ఒకరు చొప్పు న మొత్తం ముగ్గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు ఆయన తెలిపారు. డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 7,642మంది విద్యార్థులకు గానూ 7,212 మంది, 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 3,599 మంది హాజరైనట్లు తెలిపారు.

అంతర్జాతీయ క్రీడాకారిణికి నగదు పురస్కారం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): అంతర్జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్ క్రీడాకారిణి తమ్మనే మౌనికను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం ఘనంగా సన్మానించి రూ.50 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ధర్పల్లి మండలానికి చెందిన మౌనిక ఇటీవల శ్రీలంక దేశంలో నిర్వహించిన అండర్ -20 ఇంటర్నేషనల్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. అలాగే, సౌత్ కొరియాలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ టోర్నీకి మౌనిక ఎంపికైంది. భారత టెన్నిస్ బాల్ క్రికెట్ టీమ్‌కు తెలంగాణ నుంచి ఎంపికైన తొలి క్రీడాకారిణి మౌనిక కావడం విశేషం.

పాత సామగ్రి షెడ్‌లో అగ్ని ప్రమాదం

- రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం



ప్రమాదాన్ని చిత్రీకరిస్తున్న స్థానికులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సిరిసిల్లా రోడ్‌లో గల పాత ఇనుప సామగ్రి షెడ్‌లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. వివరాలు.. శనివారం తెల్లవారుజామున సిరిసిల్ల రోడ్‌లోని అయ్యప్ప కమాన్ ఎదురుగా పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేసే షెడ్‌లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి దట్టంగా పొగలు రావడంతో రోడ్డుపై వాకింగ్ చేస్తున్న కొందరు, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. సుమారు రెండు గంటల పాటు మంటలు ఎగసిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

గుట్కా పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని పలు కిరాణా షాపులలో నిషేధిత గుట్కాలు అమ్ముతున్నారని ఫిర్యాదు రావడంతో శనివారం ఎస్సై మోహన్‌రెడ్డి తనిఖీలు చేపట్టారు. ఒక షాపులో గుట్కాలు విక్రయిస్తుండగా పట్టుకున్నారు. రూ.5 వేల విలువ గల గుట్కాను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పాన్ మసాలాల పేరుతో జర్దా, గుట్కాలు అమ్మువద్దని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

గుట్కా అమ్మితే జైలుకే..

మాచారెడ్డి: గుట్కా, మత్తు పదార్థాలు అమ్మితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. శనివారం పాల్వంచ మర్రి వద్ద పలు కిరాణా షాపులను తనిఖీ చేశారు.

పాన్‌షాప్‌లలో పోలీసుల తనిఖీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని పలు పాన్ షాపులలో శనివారం పోలీసులు తనిఖీలు చేశారు. ఎస్సై మహేష్ పోలీసు సిబ్బందితో కలిసి సోదాలు చేయగా.. 50 గుట్కా ప్యాకెట్లు లభ్యమైనట్లు తెలిపారు.

దోమకొండ పరిధిలో..

దోమకొండ: మండల కేంద్రంతో పాటు అంచనూరులో కిరాణా దుకాణాలపై శనివారం ఎస్సై గణేశ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. గుట్కాలు, పాన్ పరాక్, ఇతర మత్తు పదార్థాలు అమ్మితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది లింగం స్వామి తదితరులున్నారు.

గుట్కా విక్రేతలపై కేసు

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి, బీటీఎస్ ప్రాంతంలో గుట్కాను విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. జంగంపల్లి గ్రామానికి చెందిన కిరాణాదుకాణం యజమానులు కల్వకుంట్ల వెంకటేష్, కుమ్మరి వెంకట్రాజు, బీటీస్ ప్రాంతంలోని కిరాణ దుకాణం యజమాణి మందుల రాజు కుమార్ గుట్కాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగర ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి మిర్చి కాంపౌండ్‌లోని ఓ రైస్ మిల్‌పై శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. భారీగా పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిసింది. పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్నారనే సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడులలో సుమారు 400 నుంచి 500 క్వింటాళ్ల వరకు ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. రైస్ మిల్లుకు టాస్క్ ఫోర్స్ పోలీసులు తాళాలు వేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. రెవెన్యూ అధికారులు, ఒకటవ టౌన్ పోలీసులకు అప్పగించలేదు. టాస్క్ ఫోర్స్ సీఐను వివరణ కోరగా పైఅధికారులకు తెలుసునని దాటవేశారు.

గోవులను తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

భిక్కనూరు: పరిమితికి మించి వాహనంలో పశువులు తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక వాహనంలో ఐదు పెద్ద గోవులు, నాలుగు చిన్న ఆవు దూడలు కనిపించాయని, వెంటనే గోవులను జంగంపల్లి గోషాలకు తరలించామని ఎస్సై వివరించారు.